# పేదలకు ఆపత్కాలంలో ఆర్థిక చేయూత



క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, ఏప్రిల్ 7: పేదలకు ఆపత్కాలంలో సీఎం రిలీఫ్‌ఫండ్ ఆర్థిక చేయూత నందిస్తోందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. సోమవారం గోల్నాక క్యాంపు కార్యాయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనారోగ్యంతో బాధపడుతూ పలు దవాఖానల్లో చికిత్స పొందిన 35 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహా నిధి ద్వారా మంజురైన రూ.12.75లక్షల విలువగల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేలాది మంది పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రతి ఏటా సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూతనందించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే వేలాది మంది పేదలకు వైద్య సేవల కోసం తన ఆఫీసులో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారు నేరుగా వచ్చి ఆఫీసులో సంప్రదించవచ్చని తెలిపారు.

## ప్రత్యేక రాయితీతో పుస్తకాల విక్రయం

తెలుగుయూనివర్సిటీ, ఏప్రిల్ 7: సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించిన గ్రంథాలను ప్రత్యేక రాయితీతో విక్రయించడానికి పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 8వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నాంపల్లి ప్రాంగణంలో గల పుస్తక విక్రయ కేంద్రంలో ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు తెరిచి ఉంటుందని అన్నారు. ప్రతి పుస్తకంపై 60 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రాచీన గ్రంథాలు, సాహిత్యం, నిఘంటువులు, సంగీత, నృత్య గ్రంథాలు, భారత, భాగవతాలు, ప్రబంధాలు, పురాణాలు, పంచకావ్యాలు, ఇతిహాసాలు, చరిత్ర గ్రంథాలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు తగ్గింపు ధరలలో విక్రయానికి సిద్ధంగా ఉంటాయని, సాహితీవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు, భాషా ప్రి యులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మినార్‌గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విద్యుత్ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ సోమిరెడ్డి

చార్మినార్, ఏప్రిల్ 7: వినియోగదారుల సమస్యలను గుర్తించి వాటి పరిస్కారం కోసం కృషి చేసినప్పుడే వారి మన్ననలను పొందగలమని టీజీఎస్పీ డీసీఎల్ ఎస్ఈ సోమిరెడ్డి తెలిపారు. సోమవారం సాలర్‌జంగ్ మ్యూజియం సమీపంలో నిమినార్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగులు చేసే పనికి ప్రజల నుంచి మెప్పు పొందాలంటే వారితో సఖ్యతగా మెలగాలని అన్నారు. విద్యుత్ అంతరాయము కలిగి నప్పుడు ప్రజలు ఫ్యూస్‌కాల్ నంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే స్పందించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, అధికారులకు స్థానికంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ నంద్‌కుమార్, విద్యుత్ శాఖ కమర్షియల్ డైరెక్టర్ సాయిబాబా, చక్రపాణి, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు,



ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎంపికైన మాజీ ఎంపీ విజయశాంతిని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, రాజీవవ్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకటేశ్ సన్మానించారు. శాసన మండలిలో సోమవారం విజయశాంతి ఎమ్మెల్సీ గా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆమెను కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. – అబిడ్స్, ఏప్రిల్ 7

## బీసీ రిజర్వేషన్లపై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి



కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేస్తున్న గుజ్జ కృష్ణ

కాచిగూడ, ఏప్రిల్ 7: బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లకు 42 శాతం అసెంబ్లీలో ఆమోదించిన బిల్లుకు ప్రతిపక్షాల పార్లమెంటు సభ్యులు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీలో ఆమోదించిన బిసి రిజర్వేషన్ బిల్లుపై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని గుజ కృష్ణ, కోలా జనార్ధన్ ఆధ్వర్యంలో సోమవారం పిసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు వినతి పత్రం అందజేశారు. కాచిగూడలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చట్ట సభల్లో బిసి రిజర్వేషన్లు అమలు చేసి, దేశ వ్యాప్తంగా సమగ్ర కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోట కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కోలా జనార్ధన్, జయంతి గౌడ్, నందగోపాల్, ఉదయ్‌నేత, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మహిళా కార్యదర్శిగా వెంకట సుబ్బమ్మ

కాచిగూడ, ఏప్రిల్ 7: రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా మేకల వెంకట సుబ్బమ్మ నియమితులయ్యారు. ఈ మేరకు ఆల్ ఇండియా మహిళా అధ్యక్షురాలు ఆదేశాల మేరకు వెంకటసుబ్బమ్మను తెలంగాణ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు నియామక పత్రాన్ని సోమవారం అందజేశారు.



నియామక పత్రాన్ని అందజేస్తున్న సునీతారావు

## సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

చార్మినార్, ఏప్రిల్ 6: సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సోమవారం బాధ్యతలను చేపట్టింది. ఇటీవల జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో న్యాయవాదులు కార్యవర్గ సభలను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి. నవీన్ కుమార్, ఉపాధ్యక్షుడిగా ఏ. ఎన్. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఏ. అజయ్, కార్యదర్శిగా బి. రాజి రెడ్డి, కోశాధికారిగా వి. నిర్మల, లైబ్రరీ కార్యదర్శిగా రాకేశ్ కులకర్ణి లతోపాటుగా పలువురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నవీన్ మాట్లాడుతూ, న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ పరంగా అండాల్సిన వివిధ ప్రయోజనాలను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యనిర్వాహక సభ్యులు

## థియేటర్ యాక్టింగ్ వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డా. మామిడి హరికృష్ణ తదితరులు

రవీంద్రభారతి, ఏప్రిల్ 7: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ థియేటర్ అండ్ మీడియా రిపర్టరీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 24వ యాక్టింగ్ వర్క్‌షాప్ ఈ నెల25 నుంచి ప్రారంభం కానుందని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ తెలిపారు. రవీంద్రభారతిలోని ఆయన కార్యాలయంలో సోమవారం దానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఔత్సాహిక నటీనటులు శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 45 రోజుల పాటు ఈ వర్క్‌షాప్ జరుగనుందని నిర్వాహకులు రమేశ్, కిషన్‌గౌడ్ తెలిపారు. ఇతర వివరాల కోసం ఫోన్ 9247140023 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

## కళారంగాల్లో పిల్లలను ప్రోత్సహించాలి



వివిధ రంగాలలో రాణిస్తున్న వారికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేస్తున్న వక్తలు

తెలుగుయూనివర్సిటీ, ఏప్రిల్ 7 : అక్షయ సామాజిక, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆబిడ్స్ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో పలువురికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చిన్నారి కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నత్య ప్రదర్శనలు ఆహూతులను మంత్రముగ్ధులను చేశాయి. అడిషనల్ డీసీపీ రాందాస్‌తేజ, నృత్య గురువులు డాక్టర్ రేవతి, డాక్టర్ చింతాకృష్ణప్రియ, డాక్టర్ చల్లా యామిని, డి. సంధ్యలక్ష్మి, వై. తులసి, ఎ. సంధ్యారాణి, మెట్రో టీవీ అధినేత జయప్రసాద్ పాల్గొని ఆయా రంగాలలో రాణిస్తున్న వారికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. చి న్నారులను ప్రోత్సహించడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని వక్తలు తెలిపారు. పురస్కారగ్రహీతలను ప్రోత్సహించేలా పురస్కారాలు అందించడం ముదావహమని సంస్థ నిర్వాహకుడు సీహెచ్ సీతారామ్ కృషిని ప్రశంసించారు.

## సేవా పురస్కారం ప్రదానం



కటికం రోజాను సత్కరిస్తున్న సిటిజన్ కౌన్సిల్ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణముదిరాజ్

అబిడ్స్, ఏప్రిల్ 7 : ప్రతి ఒక్కరూ వ్యాయాయం చేయడం వల్ల తమ ఆరోగ్యాలను కాపాడుకోవచ్చని సోషల్ యాక్టివిస్ట్ తయిబా తస్మీన్ అన్నారు. పాతబస్తీ అలియాబాద్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వివిధ వ్యాధులపై నిర్వహించిన అవగాహన శిబిరంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత రోజుల్లో ప్రతి మనిషి గుండె, కిడ్నీ సమస్యలు మహిళలకు గైనకాలజీ సమస్యలతో బాధపడుతున్నారని, వాటిని అరికట్టాలంటే ప్రతి రోజూ వ్యాయామం, యోగా చేయాలని అన్నారు. అలియాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శృతి , తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణముదిరాజ్ మాట్లాడుతూ, 40 సంవత్సరాలుగా ఆరోగ్య సమస్యలపై క్యాన్సర్, కిడ్నీ, మలేరియా, గుండె, హైపర్ టెన్షన్, చక్కర తదితర వ్యాధులపై నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న కటికం రోజా ను సేవా పురస్కారంతో సన్మానించారు. కాంగ్రెస్ నాయకుడు కాశమని శ్యామ్‌రావు ముదిరాజ్, పూల్ బాగ్ చెమన్ ప్లేగ్రౌండ్ సీనియర్ సిటిజన్లు కే. హనుమంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు బీవై శ్రీకాంత్, జి. నవీన్ కుమా ర్, కిరణ్‌చారి, ఆంజనేయులుచారి, ఆసుపత్రి సిబ్బంది సత్యరాణి, ఎం. నిర్మల రాణి, డి. వనిత, గాయత్రి, సుమలత, వంశీకృష్ణ, కే. నర్సింగరావు లు రోజాను సన్మానించి అభినందనలు తెలిపారు.

## ఏప్రిల్ 14న గిరిజన శక్తి రాజ్యాంగ రక్షణ ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్ చౌహాన్

రవీంద్రభారతి, ఏప్రిల్ 7 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను పురస్కరించుకొని బషీర్‌బాగ్ చౌరస్తాలోని బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ట్యాంక్ బండ్‌పై గల , సచివాలయం పక్కన ఉన్న 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాలు, విద్యార్థి సంఘాలతో భారీ ఎత్తున గిరిజన శక్తి ఆధ్వర్యంలో కళాకారులతో భారత రాజ్యాంగ రక్షణ భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్ చౌహాన్ తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ర్యాలీకి దళిత బహుజనులు విద్యార్థులు, ప్రజా సంఘాలు భారీగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొండ్రపల్లి రమేశ్, సందీప్, నరేందర్, వేమూలూరి అనిల్‌చారి, తరుణ్, నిఖిల్, భరత్, ఉమేశ్, సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.


## ఆరోగ్యమే అసలైన సంపద



ప్రపంచ ఆరోగ్య దినోత్సవంలో పాల్గొన్న కుమారస్వామి, అతిథులు

కాచిగూడ, ఏప్రిల్ 7: ఆరోగ్యమే అసలైన సంపదని, అందుకు ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం బ్లీస్ బర్గ్ ఫీచర్ ఆఫ్ హోప్ సంస్థ ఆధ్వర్యంలో అందరికీ మంచి ఆరోగ్యం 2025 అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కుమారస్వామి హాజరై మాట్లాడుతూ.. నీవు తినేదే నీ ఔషధం.. ఆరోగ్యమే నీకు సర్వస్వం అని పేర్కొన్నారు. శుభ్రతను పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చు అని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ వినయ్, డాక్టర్స్, మేధావులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## ఓయూ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్‌గా సతీశ్‌కుమార్



ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్‌గా ప్రొఫెసర్ పి సతీశ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన హెడ్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారం. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకుడు తోట శ్రీనివాస్, పరిశోధక విద్యార్థులు రవీందర్, వినోద, భాగ్య తదితరులు పాల్గొన్నారు. – ఉస్మానియా యూనివర్సిటీ

## వ్యక్తి మృతి

మెహిదీపట్నం, ఏప్రిల్ 7 : ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన లంగర్‌హౌస్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. లంగర్‌హౌస్ రింగ్‌రోడ్డు పిల్లర్ నంబర్ 112 సమీపంలో ఆదివారం సాయంత్రం ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. తన పేరు యాదగిరి అని, దోమలగూడలో ఉంటానని చెప్పాడని పోలీసులు తెలిపారు. వివరాలకు 8712660430 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

## స్పెషల్ రైల్లో దొంగతనం

కాచిగూడ, ఏప్రిల్ 7: కాచిగూడ రైల్లో ప్రయాణికురాలి నగదును గుర్తుతెలియని వ్యక్తి దొంగలించాడు. కాచిగూడ రై ల్వే సీఐ ఎల్లప్ప వివరాల ప్రకారం.. తమిళనాడులోని కన్యాకుమారికి చెందిన జె. జయ (68) స్పెషల్ రైల్లో కాచిగూడకు వస్తుండగా డోన్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆమె బ్యాగును దొంగిలించారు. అందులో రూ.18 వేలు ఉన్నట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ కర్నూల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

## బెట్టింగ్ ముఠా అరెస్ట్

చార్మినార్, ఏప్రిల్ 7: ఐపీఎల్ నేపథ్యంలో బెట్టింగ్ మాఫియా ఫంటర్‌లను ఆకర్షిస్తూ బెట్టింగ్‌లకు పాల్పడుతోంది. ఎక్కడో ఇతర రాష్ట్రంలో ఉంటూ స్థానికంగా ఏజెంట్‌లను ఏర్పాటు చేసుకొని వ్యవహారం నడిపిస్తున్న వ్యక్తులపై సోమవారం మహంకాళి, సౌత్‌జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. టాస్క్ ఫోర్స్ అదనపు డీసీపీ శ్రీనివాసరావు తెలిపిన ప్రకారం.. సికింద్రాబాద్, మంగళ్‌హాట్, గోషామహల్ ప్రాంతాలకు చెందిన గోడల సందీప్‌కుమార్, అభిషేక్‌కుమార్‌లు సబ్ బుకీలుగా వ్యవహరిస్తున్నారు. వారి వద్ద వినయ్‌సింగ్ బెట్టింగ్ ఫంటర్ల నుంచి నగదు వసూళ్లు చేస్తూ నిందితులకు అందిస్తుంటాడు. సందీప్ కుమార్, అభిషేక్ కుమార్‌లు క్రికెట్ అభిమానుల్లో ఉన్న హైప్‌ను వినియోగించుకుం టూ ఢిల్లీలో ఉన్న ప్రధాన బుకీ ఆదేశం సంప్రదిస్తూ నగరంలోని ఫంటర్‌లతో సోమవారం బెట్టింగ్ నిర్వహిస్తున్న ఫంటర్ యశ్వంత్ గుప్తాకు సంబంధించిన సమాచారం అందుకున్న పోలీసులు ఏకకాలం లో దాడులు నిర్వహించి నిందితుల వద్ద నుంచి 4 ఫోన్‌లు, రూ.92వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తదుపరి విచారణ నిమిత్తం మహంకాళి పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

## 42 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్డ్‌లో చేర్చాలి



అభివాదంచేస్తున్న ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ

రవీంద్రభారతి, ఏప్రిల్ 7 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే 42 శాతం బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్డ్‌లో పొందపరించి, బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ పోరాట యోధుడు, బీసీ ఆజాదీ జేఏసీ చైర్మన్ బత్తుల సిద్దేశ్వర్ పటేల్ ఢిల్లీలో బీసీ రిజర్వేషన్ల సాధనకోసం చేస్తున్న ఆమరణ నిరాహారదీక్షకు పలు బీసీ సంఘాలు సంఘీభావం ప్రకటించాయని నేషనల్ ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ తెలిపారు. తెలంగాణ అసెంబ్లీలో ఆమోదించిన బీసీ బిల్లును పార్లమెంట్‌లో అమోదించి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, కేంద్రం చేపడుతున్న జాతీయ జనగణలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిద్దేశ్వర్ ఢిల్లీలో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష నేటికి 7వ రోజుకు చేరుకున్నదని రామకృష్ణ పేర్కొన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రామకృష్ణ వివిధ బీసీ సంఘాల నేతలు మేకపోతుల నరేందర్‌గౌడ్, బొంగు ప్రసాద్ గౌడ్,కిరణ్‌కుమార్‌గౌడ్, సతీశ్‌కుమార్ పటేల్‌తో కలిసి మాట్లాడుతూ.. 7 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న పటేల్ ఆరోగ్యం క్షిణించిందని, తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని నిరాహార దీక్ష విరమింపజేయాలని కోరారు. రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ జోక్యం చేసుకొని బీసీ బిల్లును పార్లమెంట్‌లో పెట్టే విధంగా కేంద్రంపై వత్తిడి తీసుకురావాలని, లేకుంటే బీజేపీ నేతలను గ్రామాలలో తిరుగనివ్వమని రామకృష్ణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ బీసీ కుల సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి సెలవుల్లోగా స్విమ్మింగ్ పూల్‌ను అందుబాటులోకి తెస్తాం

గోల్నాక, ఏప్రిల్ 7: విద్యార్థుల వేసవి సెలవుల్లోగా మున్సిపల్ స్విమ్మింగ్‌పూల్‌ను అందుబాటులోకి తెస్తామని అంబర్ పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ తెలిపారు. సోమవారం ఆయన అంబర్ పేట మున్సిపల్ మైదానంలోని స్విమ్మింగ్‌పూల్‌ను ఆయన పరిశీలించారు. స్విమ్మింగ్‌పూల్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు దాదాపుగా అన్ని పనులు పూర్తి చేశామని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్విమ్మింగ్‌పూల్ సిబ్బంది పల్లె రాజు, షఖీల్, సురేశ్, ప్రశాంత్, కృష్ణ బీఆర్ఎస్ నాయకుడు సంతోష్‌చారి తదితరులు పాల్గొన్నారు.




స్విమ్మింగ్‌పూల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్



## సమస్యల పరిష్కారానికి కృషి

కాచిగూడ, ఏప్రిల్ 7: డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్ అన్నారు. డివిజన్‌లోని మనియార్ పట్టి, నింబోలి అడ్డ, తదితర ప్రాంతాల్లో పాదయాత్ర చేసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్తీల్లో సమస్యలు తలెత్తితే నేరుగా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాసు,భీమరాజ్, రామకృష్ణ, రవి యాదవ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడానికి అధికారులకు కృషి చేయాలని నియోజకవర్గ ఎమ్మెల్యే మమ్మద్ కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. సోమవారం టోలిచౌకిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నలుగురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందించారు. – మెహిదీపట్నం, ఏప్రిల్ 7

## శోభాయాత్ర నిర్వాహకులపై కేసులు

అబిడ్స్ ఏప్రిల్ 7: శ్రీరామ నవమిని పురస్కరించుకొని సీతారాం బాగ్, ధూల్‌పేట్ చి వేర్వేరుగా నిర్వహించిన మూడు ర్యాలీలకు అనుమతులను ఉల్లంఘించినట్లుగా మంగళ్‌హాట్ పోలీసులు నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. సీతారాం బాగ్ ఆలయం నుంచి భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించగా, ధూల్‌పేట్ ఆకాశపురి హనుమాన్ ఆలయం నుంచి గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ శోభాయాత్రను నిర్వహించారు. ధూల్‌పేట్ నుంచి ఆనంద్ సింగ్ సీతారాముల పల్లకి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు అనుమతులను ఉల్లంఘించినట్లుగా గుర్తించి కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

## ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్



పోలీసులు అరెస్ట్‌చేసిన ద్విచక్రవాహనాల దొంగ

గోల్నాక, ఏప్రిల్ 7: నగరంలోని పలు ప్రాంతాల్లో బైక్‌లను దొంగిలించిన వ్యక్తిని అంబర్ పేట పోలీసులు అరెస్ట్ చేశారు. డీఐ పి.మల్లేశ్వరి తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్ అంబర్‌పేట శారదానగర్‌కు చెందిన సాయిరాంగౌడ్ ఈ నెల ఒకటిన తన ఇంటి ముందు యూనికార్న్ బైక్ ( AP10 AQ5368) పార్కు చేయగా చోరీకి గురైంది. ఆయన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు బైక్ చోరీకి పాల్పడింది బడంగ్ పేట్ అల్మాస్‌గూడకు చెందిన వడ్ల శ్రీనివాస్ ( 45) గా గుర్తించారు. అతడిని సోమవారం అరెస్ట్ చేసి యూనికార్న్ బైక్ తో పాటు దొంగిలించిన మరో స్ప్లెండర్ ప్లస్ బైక్ ను స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించారు.